క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. మండలంలో లొద్దలపేట గ్రామంలో మంగళ వారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవిలో ఎక్కువగా ప్రజలు ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలన్నారు. వేసవిలో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


తక్షణ సహాయం అందజేస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురం గ్రామానికి చెందిన బొట్ట నారాయణరావు ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు మృతుని భార్య జ్యోతికి మంగళవారం అందించారు. సర్పంచ్ గణపతి ప్రధాన్, కార్యదర్శి మోహన్‌రావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఆమదాలవలస రూరల్: ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తోందని యూనియన్ బ్యాంక్ సీఎఫ్ఎల్ ఫీల్డ్ ఇన్‌చార్జి చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. మండలంలో ఈసర్లపేట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం కళాజాత ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న సభ్యులు పొదుపు చేయడం వల్ల భవిష్యత్ అవసరాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. ఏటీఎం కార్డు వినియోగాలు, డిజిటల్ మోసాల గురించి వివరించారు. సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కె.మహేష్, కళాజాత బృందం సభ్యులు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 14వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌ల్లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కాలేజీలో బోధించేందుకు అన్ని గ్రూపులకు పూర్తి స్థాయిలో అధ్యాపకలు ఉన్నారని, సైన్స్ ల్యాబ్ తోపాటు అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులను కాలేజీలో జాయిన్ చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు.

పాఠశాలల ఖాతాల ఆడిట్


నరసన్నపేటలో ఆడిట్ నిర్వహిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతోపాటు కోటబొమ్మాళి మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల స్కూళ్ల ఖాతాలు, రికార్డులను శ్రీకాకుళం నుంచి వచ్చిన బృందం ఆడిట్ నిర్వహించింది. 2021, 2022 ఆర్థిక సంవత్సరాలకు చెందిన రికార్డులు, ఖాతాలను మంగళవారం పరిశీలించారు. నగదు, ఖర్చులు, వాటి రసీదులు ఇలా అన్ని అంశాలను ఆడిట్ బృందం పరిశీలించింది. ఐదు మండలాల నుంచి 60 స్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు వచ్చి తమ స్కూళ్ల రికార్డులను ఆడిట్ చేయించుకున్నారు. ఇలా ప్రతీ స్కూల్ రికార్డులు ఆడిట్ చేస్తారు. విడతల వారిగా సమాచారం అందించి ఆడిట్ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నరసన్నపేటలో ఆడిట్ సజావుగా పూర్తయిందని ఎంఈఓ శాంతారావు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొత్తూరు: మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రసాదరావు మంగళవారం తెలిపారు. సోషల్ మీడియాలో ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కించపరిచేలా కొంతమంది పోస్టులు పెట్టారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న కొత్తూరు మండలంలోని ఎస్ఎస్‌కాలనీకి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ఎమ్మెల్యే వాహనాన్ని కూడా అడ్డుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గడపగడపకూ సంక్షేమ ఫలాలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి


పొందూరు: మున్సిపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: మండలంలోని గోకర్నపల్లి పంచాయతీలోని రంగనాథపేట, మున్సిపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను మంగళవారం వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రంగనాథపేటలో శ్మశానికి రోడ్డు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. సర్పంచ్ చింతాడ మాధురి, మాజీ ఎంపీటీసీ చింతాడ సత్యప్రసాద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, ఎంపీటీసీ కిల్లాన సూర్యారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాడాన కృష్ణ, చింతాడ రాజశేఖర్, జీవరత్నం పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు..

జలుమూరు: ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రాణ పంచాయతీ పరిధి గొళియాపుట్టి, జగన్నాథపురం, దాలప్పపేట గ్రామల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయుకుడు దుంగ ప్రసాద్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్‌లో పైపులైన్‌లు వేసి కుళాయిలు అమర్చకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి పలువురు మహిళలు తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సంబంధిత గుత్తేదారునితో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం జలుమూరులో పనులు జరుగుతున్నాయని, త్వరలోనే పైపులైన్‌లు వేసి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అర్హులు జగనన్న ఇళ్ల కోసం సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సీతారాం, మండల సలహాదారుడు పైడి విఠలరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

హిరమండలం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కిట్టలపాడు సచివాలయ పరిధిలోని అంతకాపల్లి, పూనిపేట, అక్కరాపల్లి, ఇప్పగూడ గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడిక్కడే పరిష్కార చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిదంగా ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేస్తున్న సీఎం జగనన్నకు మరోసారి ఆశీర్వదించాలన్నారు. తహసీల్దార్ బి.మురళీమోహన్, ఎంపీడీఓ బి.శైలజ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఎంపీటీసీ సభ్యులు లుకలాపు సావిత్రి, వి.చిన్నారావు, సర్పంచ్ గొంటి ప్రభావతి, ఉప సర్పంచ్ కష్టారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు .


జలుమూరు: జగన్నాథపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


హిరమండలం: ఇప్పగూడ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పోలాకి అభివృద్ధికి పెద్దపీట


డంపింగ్‌యార్డ్ కోసం స్థలపరిశీలన చేస్తున్న కృష్ణచైతన్య, అధికారులు

- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: పోలాకి మండల కేంద్రం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. పోలాకి పంచాయతీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయంగా తమ కుటుంబానికి అండగా ఉన్న పోలాకి పంచాయతీ ప్రజల రుణం తీర్చుకుంటామని, ఏ అవకాశం వచ్చినా పోలాకి అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ముఖ్యంగా డంపింగ్‌యార్డ్, ఎస్సీల శ్మశాన వాటికలో భవన నిర్మాణం, ప్రయాణికులకు విశ్రాంతి భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీ, మత్స్యకారులకు దుకాణాల ఏర్పాటు తదితర అంశాలపై స్థానిక నాయకులు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మజ్జి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ తూలుగు అశోక్‌కుమార్, రెంటికోట త్రినాథరావుతో కలిసి స్థలాల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీఓ ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


అన్నంపేటలో విచారణ చేపడుతున్న అధికారులు

బూర్జ: మండలంలోని అన్నపేట గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.మల్లేశ్వరరావు ఉపాధి పనుల్లో పలు అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఏపీఓ వి.రాజ్‌కుమార్ ఆ గ్రామానికి మంగళవారం వెళ్లి ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. బినామీ మస్తర్లు, ఒకరికి బదులు వేరొకరు వేస్తున్నారని రుజువుకావడంతో.. మరలా ఇలాంటి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేయాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి పండగలు


అమ్మవారి పండగల్లో పాల్గొన్న భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో 9 రోజుల నుంచి జరుగుతున్న అమ్మవారి, గ్రామదేవత పండుగలు మంగళవారంతో ముగిశాయి. గ్రామంలోని మహిళలంతా ఘటాలు పట్టుకుని అమ్మవారి, గ్రామదేవత ఆలయాలకు చేరుకుని ప్రత్యేక, విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే హక్కు కలమటకు లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీని విమర్శించే హక్కు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు లేదని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రకు మద్దతుగా ఈ నెల 15న కొత్తూరులో నిర్వహించిన సమావేశంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలమట విమర్శించడం హాస్యాస్పందంగా ఉందన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచిన కలమట టీడీపీకి అమ్ముడుపోయి.. నేడు సీఎం జగన్‌ను విమర్శించడం తగదన్నారు. వంశధార నిర్వాసితుల ఇళ్ల విషయంలో కలమట అక్రమాలకు పాల్పడ్డారని, ఆ అక్రమాలు బయట పడతాయన్న ఆలోచనతోనే అప్పట్లో సంక్రాంతి చేసుకోకుండా గ్రామాల నుంచి బలవంతంగా నెట్టేశారని, నేడు నిర్వాసితుల కోసం మాట్లాడటం అన్యాయమన్నారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రైతు భరోసా, గ్రామ సచివాలయం, మిల్క్ బల్క్ కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లతోపాటు రహదారుల నిర్మాణాలు కలమటకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు మెరుగయ్యాయని, ఇది అభివృద్ధి కాదా అని అన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వైస్సార్‌సీపీ నాయకులు రేగేటి కన్నయ్య స్వామి, కొయిలాపు కన్నయ్య స్వామి, లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, అగతమూడి నాగేశ్వరరావు, రంజిత్, ఆంపిలి ప్రశాంత్, పండాల వెంకట కృష్ణ, టంకాల రమణరావు పాల్గొన్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేసుకోవాలి

ఆమదాలవలస: ఆమదాలవలస సబ్ ట్రెజరీ పరిధిలో గల పెన్షనర్లు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంతవరకు ఈకేవైసీ చేయించుకోని పెన్షనర్ల జాబితాను ఎస్‌టీఓ ఎస్.సువర్ణరాజు పెన్షనర్ల సంఘానికి అందజేశారన్నారు. ఆమదాలవలస సబ్‌ట్రెజరీ పరిధిలో 591 మంది పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. ఇంతవరకు ఈకేవైసీ చేయించుకోని వారంతా నేరుగా ఎస్‌టీఓ కార్యాలయంలో, ఏదైనా నెట్ సెంటర్‌లో అయినా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

అప్రమత్తతే ఆయుధం

- అవగాహనతోనే డెంగీ దూరం


నరసన్నపేట: ఉర్లాంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది


హిరమండలం: డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట: పరిసరాల పరిశుభ్రంగా ఉంటే డెంగీ వ్యాధి దరిచేరదని ఉర్లాం పీహెచ్‌సీ ఈఓ గణపతిరావు అన్నారు. ఉర్లాంలో మంగళవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఏటా మే 16న డెంగీపై అవగాహనకు ప్రత్యేక దినంగా వైద్య శాఖ నిర్వహిస్తుందన్నారు. డెంగీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హిరమండలం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత అన్నారు. న్యూ బ్యారేజీ సెంటర్ నుంచి పీహెచ్‌సీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యమవుతుంని మెడికల్ అధికారి లీలా కుమార్ అన్నారు. జలుమూరు పీహెచ్‌సీ ఆవరణలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారవకోట: మండల కేంద్రంలో సారవకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ శుక్రవారం డెంగీ డేగా పరిగణించాలన్నారు.

రూ.25 వేల విరాళం


ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ ఆలయం అభివృద్ధికి పాతపట్నంకు చెందిన బీజేపీ నాయకుడు దుక్క శ్రీకాంత్ రెడ్డి రూ.25 వేలు మంగళవారం అందజేశారు. ఈ మొత్తం ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావుకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు నేతాజీ, కృష్ణారావు, ఆలయ క్లర్క్ సుదర్శనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు చిత్తు


నరసన్నపేట: మాట్లాడుతున్న సీఐ డి.రాము

కొత్తూరు/మెళియాపుట్టి/పాతపట్నం/సారవకోట/హిరమండలం/బూర్జ/నరసన్నపేట: చెడు వ్యసనాలతో యువత పెడదోవ పట్టకుండా ఉండాలన్న ఆలోచనతోనే యువతతో జాగృతి–యువత కోసం కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక జిల్లాలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మెళియాపుట్టి మండలంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పాతపట్నం సీఐ వినోద్ బాబు, పాతపట్నం మొండిగల వీధిలో గల ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో జాగృతి–యువత కోసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి పాల్గొని యువతకు అవగాహన కల్పించారు. నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సమావేశాన్ని సీఐ డి.రాము ఆధ్వర్యంలో చేపట్టారు. సారవకోటలోని కల్యాణ మండపంలో ఎస్ఐ అప్పారావు యువతకు అవగాహన కల్పించారు. హిరమండలం పోలీస్ స్టేషన్ ఆవరణంలో యువతతో ఎస్ఐ జి.నారాయణ స్వామి సమావేశం నిర్వహించారు. బూర్జ మండలంలోని కొల్లివలస గ్రామంలో ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ దృష్టికి గిరిజనుల సమస్యలు


ఐటీడీఏ పీఓకు సమస్యలు వివరిస్తున్న కృష్ణచైతన్య

సారవకోట: మండలంలోని గిరిజన గ్రామాల్లో గల సమస్యలపై పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారిని కలిశారు. పెదలంబ గ్రామం నుంచి గోవర్ధనపురం మీదుగా పురుషోత్తుకద్ర గ్రామం, జాతీయ రహదారి 326 నుంచి వెంకంపేట, జాతీయ రహదారి నుంచి సవర కురిడింగి గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. వీటితోపాటు మండలంలో ఇతర గిరిజన గ్రామాల్లోని గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పీఓ దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేతో మేలు

బూర్జ: సమగ్ర భూసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని కంట్లాం పంచాయతీ పరిధిలో మంగళవారం డ్రోన్ ద్వారా భూసర్వే కార్యక్రమం ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ఇది చక్కటి మార్గమన్నారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కంట్లాం సర్పంచ్ ఎస్.ఉదయ్‌కుమార్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సిరుమాను ఉత్సవం


సిరుమాను ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: వసప గ్రామంలో సిరుమాను ఉత్సవం ఘనంగా మంగళవారం నిర్వహించారు. గ్రామ దేవత చెవిటమ్మ తల్లి పండగల సందర్భంగా చివర రోజు కావడంతో మహిళలు ఘటాలతో తీరువీధి చేపట్టారు. కొత్తూరుతో పాటు పలు గ్రామా లకు చెందిన కళాకారుల వేసిన వీధి నాటకాలు ఆకట్టుకున్నాయి. పండగలకు పరిసర ప్రాంత ప్రజలతో వసపలో సందడి నెలకొంది.

స్థల పరిశీలన


రక్షణ గోడ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న రామారావు, తదితరులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న పశువైద్యశాలకు రూ.3.50 లక్షల ఖర్చుతో రక్షణ గోడ నిర్మాణం పనులు చేపట్టనున్నామని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు తెలిపారు. రక్షణ గోడ నిర్మాణానికి మంగళవారం స్థల పరిశీలన చేపట్టారు. మండల పరిషత్ నుంచి విడుదలైన నిధులతో రక్షణ గోడతోపాటు గేటు, రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు నిర్మాణం పనులు చేపట్టనున్నామని వివరించారు. పశువైద్యాధికారి డాక్టర్ జి కవిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముగడ జనార్దన తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు


తురకపేట ప్రాంతంలో వీస్తున్న ఈదురుగాలులు

ఎల్.ఎన్.పేట: మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులు వేశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో పాటు వేడి గాలులు, ఉక్క పోతతో అల్లాడి జనాలకు ఈదురు గాలులు ఊరటనిచ్చాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులు వీచాయి. వర్షం కురుస్తందని అనిపించినా గాలులతో ఆగిపోవటంతో రైతులు నిరాశ చెందారు.

బహిరంగ ప్రకటన

శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, చిన్నపలంత్రి గ్రామ కాపురస్తులు నాళ్లయింటు అయిన చిత్రి రాజారావు భార్య పద్మావతి ఇచ్చిన భోగట్టా పైని ఈ పబ్లిక్ నోటీసు.

నాళ్లయింటు మహారాజశ్రీ ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, మర్రిపాడు గ్రామ కాపురస్తులు వాకముల్లు లేటు అసిరినాయుడు కుమారుడు వాకముల్లు రమణమూర్తి పై పార్టిషన్ దావా OS 71/2023 గా వేసియున్నారనియు దానిపై సదరు వాకముల్లు రమణమూర్తి వకీలు ద్వారా కోర్టుకు వచ్చియున్నారనియు, ఇట్లుండగా సదరు వాకముల్లు రమణమూర్తి నాళ్లయింటుకు నష్టపరిచే దురుద్దేశంతో సదరు దావా పెండింగులో ఉండగా దావా షెడ్యూలు ఆస్తులు అమ్మవుటకు ప్రయత్నిస్తున్నట్లు నాళ్లయింటుకు తెలియవచ్చుచున్నదనియూ అలా చట్ట వ్యతిరేకంగా పై అసామీ వాకముల్లు రమణమూర్తితో ఎవరైనా ఏవిధమైన ఒప్పందములు ఈ క్రింది భూములపై జరిపించిన అవి నాళ్లయింటుకు బందించవని మరియు చట్టవ్యతిరేకమగునని మరియు కోర్టుకు వ్యతిరేకమగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, మర్రిపాడు గ్రామంలో ఉన్న 1. సర్వేనెం. 5/15 య 0–05 సెంట్లు పల్లం, 2. సర్వేనెం. 18/14 య 0–09 సెంట్లు పల్లం, 3. సర్వేనెం. 19/8 య 0–40 సెంట్లు పల్లం, 4. సర్వేనెం. 19/20 య 0–64 సెంట్లు పల్లం, 5. సర్వేనెం. 20/1 య 0–05 సెంట్లు పల్లం, 6. సర్వేనెం. 20/2 య 0–20 సెంట్లు పల్లం, 7. సర్వేనెం. 20/3 య 0–35 సెంట్లు పల్లం, 8. సర్వేనెం. 20/7 య 0–16 సెంట్లు పల్లం, 9. సర్వేనెం. 20/21 య 0–05 సెంట్లు పల్లం, 10. సర్వేనెం. 25/12 య 1–39 సెంట్లు పల్లం, 11. వెన్నెలవలస లో సర్వేనెం. 12/1/4 య 0–75 సెంట్లు మెట్టు, 12. మాల పవలాపురం లో సర్వేనెం. 1/1 య 0–30 సెంట్లు పల్లం, 13. తూ॥ప॥ 30 అడుగుల ఉ॥ద॥ 60 అడుగులు, 14. మర్రిపాడు కల్లం సర్వేనెం. 5/15. మర్రిపాడులో తూ॥ప 20 అడుగులు ఉ॥ద॥ 25 అడుగులు.

నరసన్నపేట
తేది: 15.05.2023

సం/- తూలుగు మధుసూదనరావు, న్యాయవాది
నరసన్నపేట. సెల్: 9440398634